# ప్రతి బింబాలు

నెయ్యిలో వేగుతున్న అరిసెలు కమ్మని వాసన వెదజల్లుతున్నాయి. మరొకవైపు పులిహోర పోపు ఘుమఘుమలాడుతోంది.

ఉదయం ఆరుగంటలకే లేచి స్నానం ముగించి, పిండి వంటలు తయారుచేసే పనిలో పడింది కామాక్షమ్మ.

పుట్టినరోజు నాడు కాస్త తొందరగా నిద్ర లేస్తే తలకునూనె పెట్టి, ఎఱ్ఱనీళ్లు ద్రిష్టితీసి పోసి, తలంటుకున్నాక ముఖాన కుంకుమ పెట్టి, మెడలో గొలుసు వేసి, దేవుని ముందు పెట్టిన కొత్త బట్టలు కొడుకుకు ఇవ్వడం అలవాటు.

'ఇంతకీ నిద్ర లేచాడో లేదో... సెలవు కదా అని దుప్పటి ముసుగు పెట్టాడో పిచ్చికన్న. వాడి కోసం కొన్న బట్టలు బీరువాలో పెట్టింది. తీసుకొచ్చి దేవుని ముందర పెట్టాలి' అనుకుంటూ స్టవ్ మంట తగ్గించి లేచి పడక గదిలోకి వెళ్లి బీరువా తలుపు తెరిచింది.

తలుపు తెరవగానే లోపలివైపు అతికించిన కొడుకు ఫొటో పలకరించింది.

అమ్మ మెడ చుట్టూ రెండు చేతులూ వేసి, ప్రేమనంతా కళ్లలో కురిపిస్తూ తల్లి ముఖంలోకి నవ్వుతూ చూస్తున్నాడు సిద్ధార్థ. మూడేళ్లవాడి ముద్దుముఖంలోకి తన్మయంగా చూస్తూ ప్రపంచంలో అన్నిటికన్నా విలువైన పెన్నిధి తన చేతుల్లోనే వున్నదన్నంత తృప్తితో నవ్వుతూ తను... నలుపు తెలుపు ఫొటో.

ఆ ఫొటో చూసినప్పుడల్లా గుండెల్లో నుండి పొంగిన ప్రేమ గొంతుదాకా వచ్చి మాటల్లో వ్యక్తం చేయలేని కారణంగా కళ్లలో నీళ్లుగా బయటపడుతుంది.



డా॥ తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

ముద్దులు మూటకట్టే కొడుకు చెంపలు తాకి 'పిచ్చినాన్నా! నా దిష్టే తగులుతుందేమో' అనుకుంటూ చేతివేళ్లు తన కణతల కానించి మెటికలు విరిచింది.

'అరిసెలు ఏకాస్త మాడినా తినడు సిద్ధు' అని గుర్తొచ్చి బట్టల కవరు తీసుకుని, బీరువా తలుపు వేసి గబగబా లోపలికి నడిచింది.

అప్పుడే లేచి ముఖం కడుక్కుని లోపలికి వచ్చాడు వెంకటరమణ.

తను వంట చేస్తుంటే వెనకాల నుండి వచ్చి మెడచుట్టు చేతులు చుట్టి, వీపుకు వ్రేలాడబడి గారాలు గుడిచే సిద్ధూని తలచుకుని, తనలో తనే నవ్వుకుంటున్న కామాక్షమ్మ ఆయన్ని గమనించలేదు.


'ఇవాళ కామాక్షికి ఇంకెవ్వరూ గుర్తుండరు' అనుకుంటూ" కాఫీ ఇస్తావా?" అనడిగాడు.

"అయ్యో! అప్పుడే మీరు లేవడం, ముఖం కడుక్కోవడం కూడా అయ్యిందా? ఇదిగో ఒక్క నిమిషం" అంటూ ఆయనకు కాఫీ కలిపే పనిలో పడింది.

ఏదో చెప్పబోయి, మళ్లీ ఆగిపోయి, ఆవిడ అందించిన కాఫీ తీసుకుని బయట వరండాలో కుర్చీలో కూర్చుని పేపరు చూస్తూ కాఫీ త్రాగ సాగాడు వెంకటరమణ.

మరి కాసేపటిలో ఏలకుల పొడి, కుంకుమ పువ్వూ వేసి చేసిన క్షీరాన్నం ఘుమఘుమలు ఇల్లంతా వ్యాపించాయి.


"వాడింకా అడ్డాల్లో బిడ్డ కాదని ఎప్పటికి తెలుసుకుంటుంది కామాక్షి?" అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు. పిండివంటలు దేవుడికి నైవేద్యం పెట్టాక అరిసెలు, పులిహోర, పాయ



సం అన్నీ స్టీలు క్యారియర్‌లో సర్దింది కామాక్షమ్మ.

అప్పటికి సమయం తొమ్మిది గంటలు కావొస్తూంది. 'ఇప్పటికైనా వీడు నిద్రలేచి స్నానం చేసి వుంటే బాగుండు. తీపి తినిపించి, కొత్తబట్టలు ఇచ్చి, తలమీద అక్షింతలు చల్లి ఆశీర్వదించవచ్చు' అనుకుంటూ క్యారియర్ పట్టుకుని అర్ధమైలు దూరంలో వున్న కొడుకు ఇంటికి బయల్దేరింది.

ఆవిడ అలసిపోయిన ముఖంతో, అడుగులో అడుగువేస్తూ గేటు దగ్గరకు వెడుతుండగా కిటికీలో నుండి చూస్తున్న అరుంధతి, వరండాలో



వున్న వెంకటరమణా ఒక్కసారే నిట్టూర్చారు.

అరుంధతి వెంకటరమణ తమ్ముడి కూతురు. తమ్ముడంటే స్వంత తమ్ముడు కాదు. చిన్నాన్న కొడుకు. అరుంధతి తల్లిదండ్రులు, బంధువులు అందరూ తిరుపతిలో పెళ్లికి వెళ్లి నెల్లూరుకి తిరిగి వస్తుండగా వాళ్ల వ్యాన్‌ని లారీ ఢీ కొట్టి అందరూ చనిపోయారు. పరీక్షలున్నాయని పెళ్లికి వెళ్లకుండా ఆగిపోయిన అరుంధతి నా అన్నవారు లేని అనాధలా మిగిలింది. ఆ పిల్లని దిక్కులేని దానిలా వదిలేయడానికి మనసురాక వెంకటరమణ తమ ఇంటికి తీసుకువచ్చాడు.

వాళ్లకి సిద్ధార్థ ఒక్కడే కొడుకు. ఆడపిల్లలు లేరు. చదువు చెప్పించి ఏదో సామాన్యమైన సంబంధంచూసి ఆ అమ్మాయి పెళ్లిచేసి పంపితే సరిపోతుందన్న జాలితో కామాక్షమ్మ అడ్డు చెప్పలేదు.

అరుంధతి వాళ్లింటికి వచ్చిన మరుసటి ఏడాది సిద్ధార్థ పెళ్లి జరిగింది. అతను ఇష్టపడిన అమ్మాయితో వివాహం జరిపించారు. కోడలు తమ ఇంటి మనిషిలా కలిసిపోవాలని కోరుకున్న వెంకటరమణ, కామాక్షమ్మల ఆశ అడియాశ అయింది.

సిద్ధార్థ భార్య రమ్యకు అరుంధతి ఆ ఇంటి ఆడబడుచులా అభిమానం పొందడం నచ్చలేదు. రమ్య బి.ఎస్సి. తో చదువు ఆపేసింది. అరుంధతి ఎమ్.బి.ఎ. చదువుతోంది. అత్తగారు



*బెంగుళూరు రవీంద్ర కళాక్షేత్రంలో డా॥ మంతెన సూర్యనారాయణరాజు 'గోదావరీ తీరం' కథల సంపుటి ఆవిష్కరణ, అంకిత సభలో రచయితను సన్మానిస్తున్న జస్టిస్, లోకాయుక్త శ్రీ వెంకటాచలమయ్య, కృతి స్వీకర్త డా॥ ఎ. రాధాకృష్ణరాజు (కుడి చివర), కవిరాజఅర్స్, పారిశ్రామికవేత్త శ్రీ శ్రీనివాసరాజు, సంపాదకులు శ్రీ సి.వి. శ్రీనివాసయ్య ప్రభృతులు.*

చేసిపెడుతుంటే టింగురంగామని కాలేజీకి వెళ్లివస్తున్న అరుంధతిని సూటిపోటీ మాటలనడం మొదలుపెట్టింది రమ్య.

సాయంత్రం కాలేజి నుంచి వచ్చి పెద్దమ్మ ఇచ్చిన ఫలహారం తినబోతూంటే "చాకిరీకి కోడలు... తిని కూర్చోడానికి నువ్వు" అనేది. అరుంధతి మనసు నొచ్చుకున్నా మాటకు మాట జవాబు చెప్పకుండా వూరుకునేది.

పండుగకు అరుంధతికి, రమ్యకూ ఇద్దరికీ మంచి చీరలు కొనుక్కొచ్చింది కామాక్షమ్మ.

"చూసారా ఆ దిక్కులేని పిల్లకన్నా ఇంటి కోడల్ని నేను తేలికయిపోయాను... దానికి తెచ్చిన చీర ముందు నాకు కొన్న చీర పాత చీరెలా వుంది" అంటూ సిద్ధార్థ దగ్గర గొణిగింది.

'పోనీలే మనిద్దరం వెళ్లి నీకు కావలసిన మంచి చీర కొనుక్కుని వద్దాం' అని సిద్ధార్థ అంటే "నాకు చీరలు కావాలంటే మా అమ్మ వాళ్లు ఎంత ఖరీదైనవైనా కొంటారు. మీ అమ్మ గారి బుద్ధి గురించి చెప్పానంతే" అని ముక్కు చీదింది.

మరోసారి కామాక్షమ్మ పెళ్లీడు వచ్చిన అరుంధతికి ఒక జత బంగారు గాజులు కూడా లేకపోవడం బాగాలేదని భర్తతో చెప్పి చేయించింది.

ఆ రోజు పెద్ద రాద్ధాంతమే చేసింది రమ్య. "అనాధ పిల్లసాటి నేను చెయ్యలేదు చూసారా? దానికి చేయించారు బాగానే వుంది... అయ్యో కోడలు కడుపుతో వుందే! తనకూ ఒక జత గాజులు చేయిద్దామని మీ అమ్మగారికి తోచ లేదు..." అంటూ మొగుడి ముందు కళ్లనీళ్లు పెట్టుకుంది.

ఆ మాటలు చెవిన పడిన కామాక్షమ్మ వూరుకోలేకపోయింది. "ఎందుకమ్మా అనాధ అంటూ ఆడపిల్లని కళ్లనీళ్లు పెట్టిస్తావు... నీకేం తక్కువ చేసామని? ఆ పిల్లకు ఆస్తి రాసిచ్చామా? ఇళ్లు కట్టించామా? ఏదో పెళ్లి కావలసిన పిల్ల కదా అని చేయించాను. నీకు పెళ్లికి పెట్టిన బంగారంతో పోలిస్తే ఇది ఎంత భాగ్యమని?" అనేసింది.

ఆ మాటలతో రమ్య మరీ రెచ్చిపోయింది. అత్తవారు తనకు పెట్టిన నగలు ఆవిడ ముందు విసిరి కొట్టి పుట్టింటికి వెళ్లిపోయింది.

ఈ గొడవలతో విసిగిపోయిన సిద్ధార్థ "అమ్మా! ఇక్కడ వుంటే రమ్య సుఖంగా వుండలేదు. మా బ్రతుకు మేము బ్రతుకుతాం" అంటూ వేరు కాపురం పెట్టాడు. ఉన్న ఊళ్లోనే తమ ఒక్కగానొక్క కొడుకు వేరుగా వుండడం వెంకట రమణ, కామాక్షమ్మలను కృంగదీసింది.

అరుంధతికి పెళ్లిచేసి పంపేస్తే గొడవలు సద్దుమణుగుతాయని, మళ్లీ తమందరం కలిసి వుంటామన్న ఆశతో మనసు గట్టి చేసుకున్నారు.

అరుంధతికి పెళ్లిచేసి పంపారుగానీ సిద్ధార్థ తల్లిదండ్రులతో కలసి వుండే ప్రసక్తి లేదు. కోడలు నెలకోసారి వచ్చి పలకరించి వెళుతుంది. కొడుకు అదీ లేదు. మనవడిమీద మమకారం చంపుకోలేక అహాన్ని చంపుకుని వెంకట రమణ, కామాక్షి కొడుకు ఇంటికి వెళ్లి చూసి వస్తారు మధ్యమధ్యలో.

పెళ్లైన రెండేళ్లకి అరుంధతి నెలతప్పింది. ఆ ఒక్క బాధ్యతా నెరవేర్చాలన్నట్టు పురిటికి తీసుకువచ్చారు. అప్పటి నుండి కోడలు కూడా తొంగి చూడలేదు.

ఆటోదిగి క్యారియర్ మోసుకుంటూ నెమ్మదిగా నడిచివస్తున్న కామాక్షమ్మకు బయట వరం


డాలో కూర్చుని పేపరు చదువుతున్న సిద్ధార్థ కనబడ్డాడు. 'నా ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్లు బ్రతుకుకన్నా' అని మనసులోనే దీవించిందామె.

తల్లిని చూడగానే పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు సిద్ధార్థ. ఈ మధ్యన అతను తల్లిదండ్రులతో మాట్లాడమే మానేసాడు. మనసు చివుక్కుమన్నా సర్దుకుని లోపలికి నడిచింది కామాక్షమ్మ.

నానమ్మను చూసి పరిగెత్తి రాబోయిన మూడేళ్ల రాహుల్ దారిలో వున్న చిన్న ముక్కాలి పీట కాలికి అడ్డం పడి క్రిందపడి ఏడుపు మొదలుపెట్టాడు.

ఒక్క అంగలో ముందుకు వచ్చి కొడుకుని ఒళ్లోకి తీసుకుంది రమ్య "దెబ్బతగిలిందా నాన్నా... లేదులే... పోతుందిలే" అంటూ. ఆ తల్లి గొంతులో బాధ సుళ్లుతిరిగింది. "ఈ పీటనే కదూ నిన్ను పడేసింది... దాన్ని క్రింద పడేద్దాం... సరేనా?" అంటూ ఆ ముక్కాలి పీటని పక్కకు తోసింది. దానిమీద ఒక దెబ్బ కూడా వేసింది 'హన్నా' అంటూ.

అక్కడితో తనకు దెబ్బ తగిలిన విషయం పూర్తిగా మరచిపోయి అమ్మ ఒడిలో నుండి లేచి "ఏం తెచ్చావు నానమ్మా" అంటూ చెంగున నానమ్మ దగ్గరకు వచ్చాడు రాహుల్. సిద్ధార్థ పోలికలు పుణికి పుచ్చుకున్న రాహుల్ అంటే



చెన్నయ్‌లో 'జనని' సాంఘిక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో చలపాక ప్రకాష్ సంపాదకత్వంలో ప్రచురించబడిన 'తెలుగు భాషకు ప్రాచీన హోదా – తక్షణ కర్తవ్యం' వ్యాస సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న బి.ఎస్.ఎన్.ఎల్. విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ వి. విజయమోహన్. చిత్రంలో 'జనని' ప్రధాన కార్యదర్శి శ్రీ గుడిమెట్ల చెన్నయ్య, సంపాదకులు శ్రీ చలపాక ప్రకాష్, ప్రముఖ రచయితలు శ్రీ షణ్ముఖశ్రీ, శ్రీ ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి.

పంచప్రాణాలు కామాక్షమ్మకు. కానీ కొడుకు కోడలూ ఎప్పుడోగాని వాడిని చూడనివ్వరు. తమ దగ్గరకు పంపించరు.

"ఏం తెచ్చావు నానమ్మా?" అంటున్న రాహుల్‌ని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది కామాక్షమ్మ.

"మీ నాన్న పుట్టినరోజు కదూ నాన్నా. అందుకని నాన్నకిష్టమైన అరిసెలు చేసి తెచ్చాను" అంటూ క్యారియర్ టేబుల్‌మీద పెట్టింది.

"ఇప్పుడవన్నీ ఎవరు తింటారు? ఆయన స్నేహితులు హోటల్లో పార్టీ ఇస్తున్నారు..." అంది రమ్య ముఖం చిట్లించి.

కామాక్షమ్మ ముఖం చిన్నబోయింది. "పోనీ లేమ్మా సాయంకాలం తినండి. ఇదిగో వాడి కోసం కొన్న బట్టలు" అంటూ కవరు కూడా టేబుల్ మీద పెట్టింది.

'రమ్యా! నువ్వంటే లక్ష్యం లేనివాళ్లు నా కోసం ఏమీ తేనక్కర్లేదనిచెప్పు... తెచ్చినవి అవి డనే తీసుకుపొమ్మను" లోపలకు వచ్చిన సిద్ధార్థ టేబుల్ మీదవున్న క్యారియర్‌ని, బట్టల పేకెట్‌నీ విసురుగా ముందుకు నెట్టాడు.

క్యారియర్ క్రిందపడి, ఆ విసురుకు మూత విడిపోయి కామాక్షమ్మ కాలికి వచ్చి తగిలింది.

"అబ్బా!" అంటూ క్రింద కూలబడింది కామాక్షమ్మ. కొడుకు పలికిన కఠినమైన మాటలు మనసుని, స్టీలు మూత కాలినీ గాయపరచగా ఆవిడ కళ్లు నీటితో నిండాయి.

"దెబ్బ తగిలిందా నానమ్మా. లేదులే ఏడవకు... నాన్న కారియర్ విసిరేస్తే దెబ్బ తగిలిందా? నేను పెద్దయ్యాక వేరే ఇంట్లో వుంటాను కదా! అప్పుడు నాన్న నా పుట్టిన రోజుకు కారియర్‌లో అప్పచ్చులు తెస్తాడు చూడు... అప్పుడు నేనూ ఇట్లాగే కారియర్ తోసి పారేస్తాలే..." అన్నాడు రాహుల్ నానమ్మ కాలు ఒత్తుతూ.

టేబుల్ దగ్గర నిలబడిన సిద్ధార్థ, గుమ్మం దగ్గర కూర్చున్న రమ్య ముఖాలు నెత్తురు చుక్క లేనట్టు పాలిపోయాయి. తమ కలల పంట, తమ పంచ ప్రాణాలు అయిన ఆ చిన్నారి నోటి వెంట వచ్చిన మాటలు వాళ్లని అశనిపాతంలా తాకాయి.

రాహుల్ పలుకులలో కనిపించిన తమ భవిష్యత్, వర్తమానంలో తమ ప్రవర్తనకు ప్రతిబింబమని తోచి ఇద్దరి కళ్లలో పశ్చాత్తాపం, బాధ తొంగి చూసాయి. "తప్పునాన్నా! అలా అనకూడదు. నువ్వు పెద్దయ్యాక కూడా నాన్న, అమ్మల దగ్గరే వుండాలి. నువ్వు దూరంగా వెళ్లిపోతే వాళ్లు ఏడుస్తారు" నీళ్లు నిండిన కళ్లతో కొడుకును చూస్తూ మనవడితో లాలనగా అంది కామాక్షమ్మ.

"అమ్మా!" అంటూ సిద్ధార్థ, "అత్తయ్యా" అంటూ రమ్య కామాక్షమ్మ దగ్గరకు వచ్చారు.

"మనం నానమ్మ దగ్గరికి వెళ్లిపోదాంరా నాన్నా. రోజూ తాతయ్య నిన్ను స్కూల్లో వదులుతారు, సరేనా" అంది రమ్య.

"అవునురా కన్నా! తాతయ్య, నానమ్మ, నేను, నువ్వు అమ్మ అందరం కలిసేవుందాం" అంటూ రాహుల్ తల నిమిరాడు సిద్ధార్థ.

"మీ అబ్బాయికి తీపి తినిపించండి అత్తయ్యా" అంది రమ్య. ఒక అరిసెను త్రుంచి వాళ్ల ముగ్గురికీ తలోముక్కా తినిపించింది కామాక్షమ్మ.

"ఇది నీకు నానమ్మా" అంటూ తన నోటికి ఒక ముక్కని అందించిన మనవడిని గుండెలకు హత్తుకుంది కామాక్షమ్మ. ●